క్లుప్తంగా

ధనమ్మతల్లికి మొక్కులు

కపిలేశ్వరపురం: కేదారిలంక గ్రామ శివారు వీధి వారిలంకలోని ధనమ్మ మర్రిలో వెలసిన ధనమ్మతల్లికి ఆడపడుచులు ఆదివారం మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మండలంతో పాటు ఆలమూరు, కొత్తపేట, కె.గంగవరం, పి.గన్నవరం తదితర మండలాల భక్తులు ధనమ్మ మర్రికి తరలివచ్చారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచిన సూర్యకి మెమెంటో అందజేస్తున్న నల్ల శ్రీను

కపిలేశ్వరపురం: అంగరలో సిద్ధిరెడ్డి నరసబాబు ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. ఈ నెల 14 వరకూ కొనసాగే పోటీల్లో భాగంగా ఆదివారం మూడు మ్యాచ్‌లు జరిగాయి. మండపేట దీపక్–గుమ్మిలేరు టీంలకు జరిగిన మ్యాచ్‌లో మండపేట దీపక్ టీం విజయం సాధించింది. దుళ్ళ–చెయ్యేరు మ్యాచ్‌లో చెయ్యేరు, మురముండ అభయ గణపతి–పడమర ఖండ్రిక మ్యాచ్‌లో మురముండ టీం విజయం సాధించాయి. ఆయా మ్యాచ్‌ల్లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచిన బాబి, జిత్తు, సూర్యలకు వైఎస్సార్ సీపీ నాయకులు వంగా నల్లశ్రీను, యర్రా వీరన్నబాబు, టోర్నమెంట్ నిర్వాహక సభ్యులు సిద్ధిరెడ్డి స్వామి చేతుల మీదుగా మెమెంటోలు అందజేశారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు



వాకతిప్పలో ముగ్గుల పోటీల్లో మహిళలు

కపిలేశ్వరపురం: మండలంలోని వాకతిప్పలో వ్యవసాయ సాగు ఉత్పత్తుల ఎఫ్‌ఎంసీ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ముగ్గుల పోటీలు విశేషంగా ఆకట్టుకున్నాయి. వాకతిప్ప, నాగులచెరువు తదితర గ్రామాల రైతు కుటుంబాల మహిళలు అందంగా ముగ్గులు వేశారు. విజేతలకు సంస్థ ఏఎం ఎం.రాజేష్, ఎంఐ రాజశేఖర్, ఎస్ఐ ఒ.సత్యం, గ్రామ పెద్దల చేతుల మీదుగా బహుమతులను అందజేశారు.

బత్తుల అప్పారావుకు సన్మానం



అప్పారావును సన్మానిస్తున్న డీలర్స్

కె.గంగవరం: జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యుడు బత్తుల అప్పారావును మండల ఫెర్టిలైజర్స్ డీలర్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. మండల కేంద్రమైన కె.గంగవరంలో ఆదివారం జిల్లా వ్యవసాయ శాఖ సలహా మండలి సభ్యుడిగా ఎన్నికైన అప్పారావుకు పూలదండలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏఓ సత్య ప్రసాద్, నాయకులు సుబ్రహ్మణ్యం, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి లక్షపత్రి పూజ



ప్రత్యేక అలంకరణలో శ్రీవారు

రాయవరం: రాయవరం శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి ఆదివారం లక్షపత్రి పూజ ఘనంగా నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో స్వామి ఉత్సవ మూర్తులకు పుణ్యాహవచనం, అభిషేకం, ప్రత్యేక పూజల అనంతరం లక్ష తులసీ దళార్చన చేశారు. అనంతరం శాంతి కల్యాణం నిర్వహించారు. ఆలయ అర్చకుడు అంగర బాబు నేతృత్వంలో వేద పండితులు వాడపల్లి గోపాలచార్యులు, అంగర అయ్యమాచార్యుల ఆధ్వర్యంలో ఉత్సవ మూర్తులకు పూజాదికాలు చేశారు. పూజల్లో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పులగం శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వర భక్తజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పట్టణంలో ఇదేమి ఖర్మ

రామచంద్రపురం: పట్టణంలోని 16వ వార్డులో టీడీపీ నేతలు ఇదేమి ఖర్మ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ రెడ్డి సుబ్రహ్మణ్యం ఆదేశాల మేరకు ఆ పార్టీ నేతలు ఇంటింటా ప్రచారం చేసి కరపత్రాలు పంపిణీ చేశారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు కడియాల రాఘవన్, క్లస్టర్ ఇన్‌చార్జ్ ఫణికుమార్, కొసనా శ్రీనివాసరావు, ఈదల రాంబాబు, జాస్తి చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

కాలిబాట.. లాభాల పంట

- వరి పంటలో కాలిబాటలతో అధిక దిగుబడులు
- వృథా ఖర్చుగా భావించి రైతుల వెనకడుగు



కాజులూరులో వెదజల్లిన పొలంలో కాలిబాటలు వేసిన దృశ్యం

కాజులూరు: వరి పంటలో కాలిబాటలు వేయడం ద్వారా అధిక దిగుబడులు రావడమే కాకుండా పంటపై తెగుళ్ల నివారణకు అవకాశముంటుంది. అయితే డెల్టాలో అత్యధిక శాతం మంది రైతులు కాలిబాటలు వేయడాన్ని వృథా ఖర్చుగా భావించి వెనకడుగు వేస్తున్నారు. పొలంలో కాలి బాటలు వేయడానికి ఎకరానికి రూ.800 ఖర్చయినా నాలుగు బస్తాల మేర అదనంగా దిగుబడిని పొందొచ్చని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కాలిబాటల ఆవశ్యకతపై ‘సాక్షి’ అందిస్తున్న కథనమిది..

ప్రతి రెండు మీటర్లకు ఒక కాలిబాట

వరి పొలంలో కాలిబాటలు వేసేందుకు పొడవాటి తాడును గట్టుకు ఒకవైపు నుంచి మరోవైపుకు పట్టుకోవాలి. తాడు పొడవునా ఒక అడుగు వెడల్పున వరి మొక్కలను తీసి పక్కన నాటాలి. పొలంలో గట్ల పక్క నుంచి ఒక అడుగు ఖాళీ ఉండేలా చూసుకుంటూ ప్రతి రెండు మీటర్లకు ఒక కాలి బాట పడేలా చూడాలి.

ఎంతో మేలు

కాలిబాటల వల్ల వరి మొదళ్లకు గాలి, వెలుతురు బాగా తగిలి చీడపీడలు త్వరగా ఆశించకుండా ఉంటాయి. బాటలకు ఇరుపక్కలా ఉన్న కుదురులు అధికంగా దుబ్బు చేస్తుంది. బాటల వెంబడి నడుస్తూ పంట తెగుళ్లు గుర్తించడానికి, కలుపు మొక్కలు ఏరివేయడానికి వీలవుతుంది. రసాయనిక ఎరువులు చల్లుకోవడం మరింత సులువవుతుంది. సస్యరక్షణ చేయాల్సి వస్తే ముందుగా తెగులు సోకిన చోట మందులను పిచికారీ చేసి, తరువాత మిగిలిన చోట చేసుకోవొచ్చు. బాటలు వెంబడి ఎలుకల నివారణ చర్యలు చేపట్టడానికి వీలవుతుంది. బాటల పక్కన ఉన్న దుబ్బులు మూడు, నాలుగు పిలకలు అధికంగా చేయడంతో పాటు, బాటలు వెంబడి తీసిన మూనలు ఖాళీస్థలంలో ఊడ్చడం వల్ల ఎకరానికి 250 నుంచి 350 కిలోల వరకు దిగుబడిని అదనంగా పొందొచ్చు.

కాలిబాటలతో ఎంతో ఉపయోగం



రైతులు అదనపు ఖర్చులు ఎందుకని భావించి కాలిబాటలకు ప్రాధాన్యమివ్వడం లేదు. నైపుణ్యం గల ఇద్దరు కూలీలను నియమిస్తే రోజుకు రెండు ఎకరాల్లో కాలిబాటలు వేస్తారు. కాలిబాటలతో ఆ ఖర్చుకు మించి నాలుగింతల ఆదాయం పెరుగుతుంది.

– పీవీవీ సత్యనారాయణరెడ్డి, రైతు, మొగలిపాలెం

వేరు బలపడకముందే వేసుకోవాలి



నాటిన వరిదుబ్బు వేరు బలపడకముందే పొలంలో కాలిబాటలు వేసుకోవాలి. కాలిబాటల్లో తీసిన మొక్కలను మూనలు తక్కువగా ఉన్నచోట నాటుకోవాలి. పొలంలో గాలి, వెలుతురు ప్రసరణ సక్రమంగా జరిగి పంటపై తెగుళ్ళు తగ్గుతాయి.

– వి.అశోక్, వ్యవసాయాధికారి, కాజులూరు మండలం

నూతన రథ నిర్మాణ పనుల పరిశీలన



ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో నూతన రథ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న మంత్రి వేణు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయానికి నిర్మిస్తున్న నూతన రథ నిర్మాణ పనులను రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో రథం జీర్ణదశకు చేరుకోవడం గమనించి తన సన్నిహితులు, పలువురు దాతలతో కలసి సుమారు రూ.కోటికి పైగా ఖర్చుతో నూతన రథ నిర్మాణానికి పూనుకున్నామన్నారు. రథ నిర్మాణంలో అత్యంత ప్రావీణ్యం కలిగిన సింహాద్రి గణపతి ఆచార్యులకు నిర్మాణ బాధ్యత అప్పగించామన్నారు. భీమేశ్వరుని కల్యాణం సందర్భంగా నిర్వహించే రథోత్సవం నాటికి రథం సిద్ధం చేయడానికి ప్రయత్నిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ పీటీవీవీ సత్యనారాయణమూర్తి(తారకేశ్వరరావు), గ్రామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, ఉప సర్పంచ్ పెన్నాడ బుచ్చిరాజు, రాజరాజేశ్వరి పీఠాధిపతి తాళ్ల సాంబశివరావు గురూజీ తదితరులు పాల్గొన్నారు.

భీమేశ్వరునికి మంత్రి వేణు ప్రత్యేక పూజలు

ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వర స్వామిని మంత్రి వేణు విశాఖపట్టణానికి చెందిన దాతలు జామి వెంకట విశ్వేశ్వరరావు, పద్మజ దంపతులతో కలిసి దర్శించుకున్నారు. స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నంది వేద పండితులు వేదాశీర్వచనం అందజేశారు. ఆలయ ఈఓ పీటీవీవీ సత్యనారాయణమూర్తి(తారకేశ్వరరావు) వారికి స్వామి వారి తీర్థప్రసాదాలు, జ్ఞాపికలను అందజేశారు.

నేటి గడప గడపకూ వాయిదా

రాయవరం: వెంటూరులో సోమవారం నిర్వహించాల్సిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం అనివార్య కారణాలతో వాయిదా పడింది. ఈ విషయాన్ని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిన్నం అపర్ణాపుల్లేష్ ఆదివారం విలేకరులకు తెలిపారు. ఈ విషయాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు గమనించాలన్నారు. తిరిగి ఎప్పుడు నిర్వహించేది ముందుగా తెలియజేస్తామని అపర్ణాపుల్లేష్ చెప్పారు.

స్లాబ్ వంతెన నిర్మాణానికి రైతుల ఆందోళన



రైతులతో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ నాగబాబు తదితరులు

మండపేట: మండలంలోని ఏడిద–వై.సీతానగరం రోడ్డులోని దేవుడుతాళ్ల కాలనీ సమీపంలో కంశాలి డ్రైన్‌పై రూ.3.8 లక్షలతో తూరల కల్వర్టు నిర్మాణానికి అధికారులు పనులు చేపట్టారు. తూరలతో కల్వర్టు నిర్మాణం వల్ల ప్లాస్టిక్ వ్యర్థాలు అడ్డుపడి మురుగునీటి పారుదలకు ఆటంకం కలుగుతుందని, స్లాబ్ వేసి కల్వర్టు నిర్మాణం చేయాలని స్థానిక రైతులు ఆదివారం పనులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. విషయం తెలిసి వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, వై.సీతానగరం ఉప సర్పంచ్ వరదా చక్రవర్తి, వైఎస్సార్‌సీపీ నేత కుడిపూడి రాంబాబు వంతెన వద్దకు చేరుకుని రైతులతో చర్చించారు. సమస్యను ఎమ్మెల్సీ తోట దృష్టికి తీసుకెళ్లారు. రైతులంతా స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీని కలిసి తమ సమస్య వివరించారు. ఏడిద నుంచి వై.సీతానగరం రోడ్డులో అసంపూర్తిగా ఉన్న రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని వాటితో పాటు స్లాబ్ కల్వర్టు నిర్మాణానికి కృషిచేస్తామని ఎమ్మెల్సీ తోట హామీ ఇచ్చారు. అంతే కాకుండా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆర్‌అండ్‌బీ జేఈ సూర్యనారాయణను ఆదేశించారు. దీంతో రైతులు ఎమ్మెల్సీ తోటకు కృతజ్ఞతలు తెలిపారు.

గనిపోతురాజు ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు



రాట ముహూర్తం చేస్తున్న వెంకన్నబాబు

మండపేట: మండలంలోని కేశవరంలో వేంచేసియున్న గనిపోతురాజు స్వామి ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నట్టు వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు తెలిపారు. ఈనెల 16వ తేదీ నుంచి మొదలయ్యే ఉత్సవాల కోసం ఆదివారం వెంకన్నబాబు ఆలయంలో పూజలు నిర్వహించి రాటముహూర్తం చేశారు. ఏటా 16వ తేదీ నుంచి నెలాఖరు వరకు జరిగే ఉత్సవాలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చి స్వామికి మొక్కుబడులు చెల్లించుకుంటారు. సంక్రాంతి పండగల సందర్భంగా 16, 17 తేదీల్లో భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. ఈ సందర్భంగా భక్తులకు ఎక్కడా అసౌకర్యానికి గురికాకుండా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని వెంకన్నబాబు చెప్పారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ముఖ్య అతిథి హాజరై ఉత్సవాలను ప్రారంభిస్తారన్నారు. ఆలయ కమిటీ సభ్యులు పురంశెట్టి శ్రీనివాస్, కుర్ర తిరపయ్య తదితరులు పాల్గొన్నారు.

ల్యాప్రోస్కోపీ విధానంపై అవగాహన కార్యక్రమం



ద్రాక్షారామలో వైద్యులు శేషగిరిరావు, హిమబిందులను సత్కరిస్తున్న పీఎంపీలు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మార్కెట్ యార్డులో పీఎంపీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కాకినాడకు చెందిన అరుణ హాస్పిటల్ అధినేతలు డాక్టర్ సీహెచ్ శేషగిరిరావు, డాక్టర్ హిమబిందులు ల్యాప్రోస్కోపీ విధానంపై పీఎంపీలకు అవగాహన కల్పించారు. శస్త్రచికిత్సలు జరిగినప్పుడు రోగులు ఎక్కువ ఇబ్బంది పడకుండా ఉండేందుకు ల్యాప్రోస్కోపీ ఆధునిక సాంకేతికత తోడ్పడుతుందని వివరించారు. అనంతరం వైద్యుల్ని సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కోశాధికారి కేవీఎస్ ప్రసాద్, ఉపాధ్యక్షుడు జేవీవీ సూర్యనారాయణ, రామచంద్రపురం మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్వర్లు, కె.గంగవరం మండల అధ్యక్షుడు మేడిశెట్టి రామకృష్ణ, జిల్లా మాజీ అధ్యక్షుడు కేఎస్ఎస్ బాబు తదితరులు పాల్గొన్నారు.

నన్నయ ఎగ్జామినేషన్ ఫ్యాకల్టీ అసోసియేట్‌గా అమ్మిరెడ్డి



వీసీ జగన్నాథరావు చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకుంటున్న మల్లిడి అమ్మిరెడ్డి

అనపర్తి: ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ పీజీ, డిగ్రీ కాన్ఫిడెన్షియల్ ఎగ్జామినేషన్స్ ఫ్యాకల్టీ అసోసియేట్‌గా మండలంలోని మహేంద్రవాడకు చెందిన డాక్టర్ మల్లిడి అమ్మిరెడ్డి నియమితులయ్యారు. దీనికి సంబంధించిన నియామక పత్రాన్ని యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఎం.జగన్నాథరావు చేతుల మీదుగా అందుకున్నట్టు అమ్మిరెడ్డి ఆదివారం స్థానిక విలేకరులకు తెలిపారు. ప్రస్తుతం యూనివర్సిటీలో కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగపు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న అమ్మిరెడ్డికి ఫ్యాకల్టీ అసోసియేట్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా అమ్మిరెడ్డికి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి, ఆక్ను ఓఎస్‌డీ ప్రొఫెసర్ ఎస్.టేకి, జీబీఆర్ విద్యాసంస్థల అధినేత తేతలి కొండబాబు, ఆక్ను అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆర్.సాంబశివరావు తదితరులు అభినందనలు తెలియజేశారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

రాయవరం: మండలంలోని చెల్లూరు గ్రామ శివార్లలో పేకాట శిబిరంపై ఆదివారం దాడి చేసినట్టు రాయవరం ఎస్ఐ పీవీవీఎస్ఎన్ సురేష్ తెలిపారు. దాడిలో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తుల్ని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.3,480 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఆరుగురి అరెస్ట్

రామచంద్రపురం: పట్టణ పరిధిలో పేకాట ఆడుతున్నారని అందిన సమాచారం మేరకు ఒక డాబా ఇంటిపై దాడి చేసి పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తుల్ని అరెస్ట్ చేసినట్టు రామచంద్రపురం ఎస్ఐ డి.సురేష్‌బాబు ఆదివారం విలేకరులకు తెలిపారు. వారి నుంచి రూ.1,36,820 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

కేశవస్వామికి లక్ష తులసి పూజ

అయినవిల్లి: ముక్తేశ్వరంలోని ముక్తికాంత సమేత క్షణముక్తేశ్వరస్వామి ఆలయంలో వేంచేసిన శ్రీ, భూ సమేత కేశవస్వామికి ఆదివారం పుష్య మాసం బహుళ విదియ సందర్భంగా లక్ష తులసి పూజ నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు అంగర శ్రీకాంత్, అర్చకులు సాయిపవన్ ఆధ్వర్యంలో విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, మండపారాధన, పంచామృతాభిషేకం, లక్షతులసి పూజ, సామూహిక కుంకుమపూజ, హోమం, పూర్ణాహుతి, శాంతి కల్యాణం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారి అన్నప్రసాదం, తీర్థప్రసాదాలు స్వీకరించారు. స్వామిని ఈ సందర్భంగా విశేషంగా పుష్పాలతో అలంకరించారు.

సామాజిక ప్రయోజనం కోసమే సాహిత్యం



విస్తృతి వ్యాస సంపుటిని ఆవిష్కరిస్తున్న డాక్టర్ ర్యాలి తదితరులు

రామచంద్రపురం: సామాజిక ప్రయోజనం కోసమే సాహిత్యమని వీఎస్ఎం కళాశాల తెలుగు అధ్యాపకుడు డాక్టర్ ర్యాలి శ్రీనివాస్ అన్నారు. స్థానిక ముచ్చుమిల్లి రోడ్డులో షిరిడీ సాయి కల్యాణ మండపంలో ఆదివారం ప్రముఖ కథా రచయిత భమిడిపాటి గౌరీశంకర్ రచించిన విస్తృతి వ్యాస సంపుటిని ర్యాలి శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ ర్యాలి మాట్లాడుతూ 53 వ్యాసాలతో నిండిన వ్యాస భూషణంలో అనే సామాజిక అంశాలను విశ్లేషణాత్మకంగా వివరించారని రచయిత భమిడిపాటిని అభినందించారు. అనంతరం కవి సమ్మేళనం నిర్వహించారు. 30 మంది కవులు కవితా గానం చేశారు. కార్యక్రమంలో తెలుగు అధ్యాపకురాలు చాగంటి నాగరాజేశ్వరి, చాగంటి సుబ్రహ్మణ్య, వారణాసి సత్తిబాబు, బంధకవిరామారావు, కవులు జనార్ధన స్వామి, రమేష్, డీటీ హేమంత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా సీఎం జగన్ పాలన

జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు



ఎమ్మెల్సీ తోటను మర్యాదపూర్వకంగా కలిసిన జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు

మండపేట: సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా అవినీతికి తావులేకుండా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పారదర్శకమైన పాలనను అందిస్తున్నారని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల నియామకంతో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందనున్నాయన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును ఆదివారం జెడ్పీ చైర్మన్ విప్పర్తి మర్యాదపూర్వకంగా కలిశారు. జెడ్పీ పాఠశాలల అభివృద్ధి తదితర అంశాలపై ఆయన ఎమ్మెల్సీ తోటతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ పాలనలో అరాచకం రాజ్యమేలిందని, ఇప్పుడు సీఎం జగన్ నేతృత్వంలో ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి పాలన అందుతోందన్నారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ న్యాయం చేసే ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ అన్నారు. ప్రతిపక్ష పార్టీలు దుష్ప్రచారాన్ని ప్రతి కార్యకర్త సమర్థవంతంగా తిప్పికొట్టాలని సూచించారు. కార్యక్రమంలో మండపేట, కపిలేశ్వరపురం జెడ్పీటీసీ సభ్యులు కుడిపూడి భవాని, పుట్టపూడి అబ్బు, మున్సిపల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ రబ్బానీ, పార్టీ నాయకులు సాధనాల శివభగవాన్ తదితరులు పాల్గొన్నారు.

పూడుకుపోయిన పంట కాలువల పునరుద్ధరణ



జేసీబీతో కాలువ పూడికతీత పనులు చేస్తున్న దృశ్యం

కాజులూరు: గొల్లపాలెం, కుయ్యేరు రహదారిలో రోడ్డును ఆనుకుని పూడుకుపోయిన పంట కాలువలను ఆర్‌అండ్‌బీ అధికారులు ఎట్టకేలకు పునరుద్ధరించారు. రహదారి వెడల్పు పనుల్లో భాగంగా రోడ్డును ఆనుకుని ఉన్న పంటకాలువలు మూసుకుపోయాయి. దీంతో పొలాలకు సాగునీరందక రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై గత నెల 26వ తేదీన ‘రోడ్డు నిర్మాణంలో పూడుకుపోయిన పంట కాలువలు’ శీర్షికన సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు పూడుకుపోయిన పంట కాలువలను జేసీబీలతో తవ్వి పునరుద్ధరించే పనులు చేపట్టారు. సమస్య పరిష్కారం కావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గొల్లపాలెంలో కోతుల బెడద

కాజులూరు: మండలంలోని గొల్లపాలెంలో గత కొన్ని రోజులుగా కోతులు హల్‌చల్ చేస్తున్నాయి. గ్రామ వీధుల్లో గుంపులుగుంపులుగా సంచరిస్తూ ఇళ్లపై పరుగులు తీస్తుండటంతో పెంకులు ఊడిపడిపోతున్నాయని స్థానికులు వాపోతున్నారు. చిన్నారులు, మహిళలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. తాళ్ళరేవు మండలం కోరంగి అభయారణ్యం దగ్గర కావడంతో అక్కడి నుంచి తణుకువాడ, శలపాకల మీదుగా కోతిమూకలు గ్రామానికి చేరుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి కోతుల సంచారాలను నిరోధించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆనాటి స్నేహం ఎంత మధురమో..



1978-80 బ్యాచ్ ఇంటర్ విద్యార్థులు

రామచంద్రపురం: పట్టణంలోని శ్రీకృత్తివెంటి పేర్రాజు పంతులు జూనియర్ కళాశాలలో 1078–80 సంవత్సరాలలో ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన విద్యార్థులు ఆదివారం కళాశాలలో కలిసి ఆనాటి స్నేహం.. ఎంత మధురమో.. అంటూ ఉల్లాసంగా గడిపారు. కొందరు విశ్రాంత ఉద్యోగులుగా ఉండగా, మరికొందరు ఇప్పటికీ ఉద్యోగాలు చేస్తున్నారు. తాము అప్పట్లో కూర్చున్న స్థానాల్లోనే కూర్చుని తమ కళాశాల రోజులను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో 27 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

దమ్ము ట్రాక్టర్లు రోడ్లపైకి తేవద్దు

రైతులకు మంత్రి వేణు విజ్ఞప్తి



దమ్ము చక్రాల ట్రాక్టరును రోడ్డు మీద నుంచి పక్కకు జరిపిస్తున్న మంత్రి వేణు

రామచంద్రపురం రూరల్: దమ్ము ట్రాక్టర్లు రోడ్లపైకి తెచ్చి కోట్లాది రూపాయల నిధులతో నిర్మిస్తున్న రహదారులను ఛిద్రం చేయొద్దని రైతులకు మంత్రి వేణు విజ్ఞప్తి చేశారు. ఆయన ద్రాక్షారామ భీమేశ్వరాలయం నుంచి కాజులూరు మండలానికి వెళుతుండగా మార్గమధ్యంలో దమ్ము ట్రాక్టరుతో రహదారిపై వెళుతున్న రైతును గమనించి తన కాన్వాయ్ ఆపి వాహనం దిగొచ్చి రైతుతో మాట్లాడారు. ట్రాక్టరుకు బెల్టు వేసుకుని అయినా వెళ్లాలి తప్ప రోడ్లను ఛిద్రం చేయొద్దని కోరారు.

హసన్‌బాదలో సంక్రాంతి సంబరాలు



హసన్‌బాదలో భోగి మంటలను ప్రారంభిస్తున్న పెద్దలు



పోటీల్లో ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయ నిర్ణేతలు

రామచంద్రపురం రూరల్: హసన్‌బాదలో గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అంబరాన్ని తాకాయి. ఉండి వీరభద్ర శర్మ బ్రహ్మత్వంలో ఎంపీ బోస్ తనయుడు సూర్యప్రకాశ్, బొల్లం సత్తిరాజు, చక్కా సోమరాజు, భలే బాబూరావు దంపతులు, సర్పంచ్ సతీష్‌రావుల చేతుల మీదుగా గోపూజతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. భోగి మంటలు వెలిగించి మహిళలు భోగి మంటల చుట్టూ కోలాటం ఆడారు. మహిళలకు ముగ్గుల పోటీలు, స్పీడ్ వాకింగ్, కుర్చీలాట, లెమన్ స్పూన్, బకెట్ బాల్ ఆటలు ఆడించారు. చిన్నారులకు స్లో సైకిలింగ్, సోలో డాన్స్‌లు, గ్రూప్ డాన్స్‌లు నిర్వహించారు. అనంతరం విజేతలకు గ్రామ సర్పంచ్ సతీష్ రావు, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.